బకాయిల బండ

- పురపాలికల్లో కొండలా పేరుకుపోతున్న ఆస్తి పన్ను, అద్దె బకాయిలు
- ఏటా 50 శాతం మేర మాత్రమే వసూలు
- ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్లకు పైగానే పెండింగ్
- పాలమూరు పురపాలికలో అద్దె దుకాణాదారులకు నోటీసులు



పాలమూరులో దుకాణం యజమానితో మాట్లాడుతున్న అధికారులు

మహబూబ్‌నగర్, జూన్ 16: ఉమ్మడి జిల్లాలో పుర పాలన మొద్దునిద్ర పోతోంది. ఆదాయం పెంచుకోవడం అటుంచితే ఉన్న ఆదాయాన్ని వసూలు చేయలేక చతికి లపడుతోంది. ఒకట్రెండు చిన్న మునిసిపాలిటీలు మినహా అన్ని చోట్లా ఆస్తి పన్ను, అద్దె బకాయిల వసూలులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆస్తి పన్ను ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో మొండి బకాయిల జాబితా అంతకంతకూ పెరిగిపోతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 పురపాలికల్లో పన్నుల రూపంలో రూ.100 కోట్లకుపైగా బకాయిలు ఉండటం గమనార్హం. ఈ బకాయిల జాబితా ఏటా పెరుగుతూ పోతోంది. దాంతో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం నిధులకు పక్క చూపులు చూడాల్సి వస్తోంది. పన్నులు సకాలంలో వసూలైతే.. కాలనీల్లో లైట్లు పోయినా, మోటార్ కాలిపోయినా, లీకేజీలు జరిగినా నిధుల కోసం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు.



అద్దె దుకాణాల బకాయి రూ.27 కోట్లు

పాలమూరు పురపాలికలో అద్దె దుకాణాల బకాయి రూ.27 కోట్లకు చేరింది. పురపాలిక పరిధిలో 275 వరకు అద్దె దుకాణాలున్నాయి. ప్రతీ నెల అద్దె వసూలు కాక పోవడంతో బకాయిలు రూ.కోట్లకు చేరాయి. దీనికి తోడు 2017లో అప్పటి కమిషనర్ దేవ్‌సింగ్ నాయక్ ఆధ్వర్యంలో లీజు పీరియడ్ పూర్తయిన గడియారం చౌరస్తా, మార్కెట్ రోడ్డులోని 53 దుకాణాలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. అయితే సిట్టింగ్ వ్యాపారులు తమ దుకాణాలను వదులుకోవడం ఇష్టం లేక పోటాపోటీగా వేలం పాడి దుకాణాలను తిరిగి దక్కించుకున్నారు. గడియారం చౌరస్తాలోని దుకాణాలకు డిమాండ్ ఉండటంతో ఒక్కో దుకాణాన్ని నెలకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు అద్దె చెల్లించేందుకు వేలం పాడి దక్కించుకున్నారు. ఆ తరువాత అద్దె చెల్లించాల్సిన సమయంలో అంత చెల్లించుకోలేమని మొండికేశారు. నాయకులతో పైరవీలు చేసి, అప్పటి పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ చేత అంతకు ముందు చెల్లిస్తున్న అద్దెకు 300 శాతం పెంచి చెల్లించాలని నోటిమాటగా అధికారులకు చెప్పించారు. దాంతో దుకాణదారులు అదే మాదిరిగా ఏడేళ్ల నుంచి అద్దె చెల్లిస్తూ వస్తున్నారు. అంతకుముందు రూ.10 వేలు అద్దె ఉంటే రూ.30 వేలు చెల్లిస్తూ వస్తున్నారు. కానీ వేలంలో రూ.లక్షకు పాటపాడితే రూ.30 వేలు పోను మిగతా రూ.70 వేలు బకాయిగా చూయిస్తూ అధికారులు రికార్డు రాసుకుంటూ వస్తున్నారు. దీంతో ఇప్పుడు ఒక్కో దుకాణంపై రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు బకాయి పెరుకుపోయింది. ఇప్పుడు పాత బకాయిలన్నీ చెల్లించాలని దుకాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో బకాయి మొత్తం చెల్లించాలని, లేదంటే దుకాణాలను ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. దీంతో ఇప్పుడు ఏం చేయాలని వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. మళ్లీ రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ పైరవీలను ప్రారంభించారు.

రాజకీయ ఒత్తిళ్లతో వెనుకడుగు

జిల్లాలోని పలు మునిసిపాలిటీలలో పన్ను వసూళ్లపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించిన ప్రతీసారి ఏదో ఒక అవాంతరం వస్తోంది. పెద్ద బకాయిల జోలికి వెళ్తే.. సదరు ఆస్తిదారుడు రాజకీయ నాయకుల నుంచి అధికారులకు ఫోన్ చేయించడంతో అధికారులు వెనక్కి తగ్గాల్సి వస్తోంది. నాయకులు జోక్యం చేసుకోకుంటే బకాయిల్లో చాలా వరకు వసూళ్లు జరిగేవి. చాలా మునిసిపాలిటీలలో పెద్ద పెద్ద భవనాలను అద్దెకు ఇచ్చిన వారు నెల నెలా రూ.లక్షల్లో అద్దెలు తీసుకుంటున్నా.. పురపాలికల ఆస్తిపన్ను మాత్రం చెల్లించకుండా దాటవేస్తున్నారు. బడాబాబులవే చాలావరకు పెండింగ్‌లో ఉంటున్నాయి. చాలామందికి సంబంధించిన ఆస్తి పన్ను ఏళ్ల తరబడి రూ.లక్షల్లో బకాయిలు ఉండటం విశేషం. ఒక్క పాలమూరు పురపాలికలోనే రూ.39.42 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ ఏడాది రూ.19.59 కోట్ల డిమాండ్‌కు గాను ఇప్పటి వరకు రూ.7.78 కోట్లు మాత్రమే వసూలైంది. మొత్తంగా ఈ పురపాలికలో ఈ ఏడాది కలెక్షన్ రూ.11.80 కోట్లు రావాల్సి ఉండగా, పాత బకాయిలు రూ.13.01 కోట్లు, వాటిపై జరిమానా రూ.14.60 కోట్లు ఉంది. మొత్తంగా ఈ ఒక్క మునిసిపాలిటీలోనే రూ.39.42 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అదే విధంగా వనపర్తి మునిసిపాలిటీలో రూ.9.20 కోట్లు, గద్వాలలో రూ.2.07 కోట్లు, జడ్చర్లలో రూ.4.48 కోట్లు, నాగర్‌కర్నూల్‌లో రూ.2.62 కోట్లు, నారాయణపేట మునిసిపాలిటీలో రూ.2.66 కోట్లు బకాయి ఉంది. ఇదివరకు మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇచ్చిన సమయంలో ప్రభుత్వం జరిమానాపై 90 శాతం మాఫీ ఇచ్చింది. మినహాయింపు ఇచ్చిన తరువాతనైనా మిగిలిన పన్ను చెల్లించారంటే అదికూడా ఆశించిన స్థాయిలో జరగలేదు.



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ

పన్నులు చెల్లించాల్సిందే



పన్నులు సకాలంలో చెల్లించినపుడే ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. పాలమూరు పురపాలికలో పన్ను వసూలుపై దృష్టి పెట్టాము. ఈ ఏడాది ఇప్పటికే రూ.ఎనిమిది కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు చేశాం. మిగతావి వేగంగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అద్దె దుకాణాలకు నోటీసులు జారీ చేసి, వారంలో చెల్లించాలని ఆదేశించాం. వారం తరువాత పన్ను చెల్లించని దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. వేలంలో పాటపాడి దక్కించుకున్న మేరకే అద్దె చెల్లించాలి.

-ఖాజా, రెవెన్యూ ఆఫీసర్



నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్ బదావత్ సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

- బదావత్ సంతోష్‌కు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించిన ఉదయకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బదావత్ సంతోష్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బదావత్ సంతోష్ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌గా బదావత్ సంతోష్ బాధ్యతలు స్వీకరించారు.

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వెల్దండ తహసీల్దార్ రవి కుమార్, కలెక్టరేట్ సీసీలు, వ్యక్తిగత సిబ్బంది ఖాజామైనోద్దీన్, గౌతమ్‌లు పూల బొకేతో స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నూతన కలెక్టర్ బదావత్ సంతోష్ క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్ బదావత్ సంతోష్‌ను ఉయద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మురుగు గుంతలో పడి బాలుడు మృతి



జశ్వంత్(ఫైల్)

రాజాపూర్, జూన్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో మురుగు గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్థులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన అల్లె శివ, లావణ్య దంపతులకు ముగ్గురు సంతానం, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు జశ్వంత్ (2) ఉన్నారు. జశ్వంత్ ఆదివారం ఇంటి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆడుకుంటూ, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మురుగునీటి గుంతలో పడిపోయాడు. కొద్ది సేపటికి కుమారుడు కన్పించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ఇళ్లల్లో వెతికారు. చివరకు అనుమానంతో గుంతలో చూడగా బాలుడు మృతి చెంది కన్పించాడు. ఈ విషయంపై ఎస్‌ఐ రవిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అమ్మో జూన్

- అన్ని వర్గాల ప్రజలకు పెరిగిన ఖర్చులు
- ప్రారంభమైన విద్యా సంవత్సరం
- రైతులకు మొదలైన సాగు
- మండుతున్న కూరగాయల ధరలు



మహబూబ్‌నగర్ రైతు బజార్‌లో కూరగాయలు కొంటున్న ప్రజలు

పాలమూరు, జూన్ 16: జూన్ నెల వచ్చిందంటే అన్ని వర్గాల ప్రజలు భయపడుతున్నారు. ఒకవైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో పాటు.. మరోవైపు పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపించడానికి ఖర్చులు పెరుగుతున్నాయి. ఇంకోవైపు రైతులు పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతున్నాయి. 20 రోజుల క్రితం ఉన్న ధరలు నేడు మరింతగా పెరిగాయి. ఇప్పుడు వర్షాకాలం ప్రారంభం కావడంతో అవసరమైనమేర కారగాయల దిగుబడి రావడం లేదు. దాంతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రంతో పాటు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

మహబూబ్‌నగర్ రైతు బజార్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	మే 26న	జూన్ 16న
టమాట	40	60
పచ్చిమిర్చి	80	90
బెండకాయ	40	50
కాకరకాయ	60	80
చౌళకాయ	60	80
బీరకాయ	80	100
క్యాబేజీ	30	40
క్యాలీఫ్లవర్	32	40
క్యారెట్	50	60
ఆలుగడ్డ	30	50
ఉల్లిగడ్డ	25	50



ఖర్చుల మాసం

జూన్ ఖర్చుల మాసంగా మారింది. రైతులు వ్యవసాయానికి సిద్ధమవడం వల్ల విత్తనాలు, ఎరువులు కొనాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు చోట్ల కందులు, మొక్కజొన్న, పత్తి సాగు చేశారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో పిల్లలకు బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, షూ తదితరాల కొనుగోలు తప్పనిసరి అవుతుంది. ప్రైవేటుగా చదివిస్తే ఫీజు తడిసి మోపెడవుతుంది. వీటికి తోడు పెరిగిన కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. గత మే 26న కేజీ రూ.25 ధర ఉన్న ఉల్లిగడ్డ నేడు రూ.50 పలుకుతోంది. టమాట రూ.40 నుంచి రూ.60కి, పచ్చిమిర్చి రూ.70 నుంచి రూ.90కి ధరలు పెరిగాయి. ఆకు కూరలదీ అదే పరిస్థితి. వీటితోపాటు బియ్యం, పప్పుధాన్యాలు, నూనె, చింతపండు ధరలూ అధికమయ్యాయి.

కూరగాయల ధరల పెరుగుదలకు కారణం ఇదీ..

మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదువేల ఎకరాల్లో కూరగాయల తోటలు సాగు చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు, సాగునీటి కొరత వల్ల సాగు తగ్గుతుంది. జూన్ నుంచి వర్షాకాలం ప్రారంభం కావడంతో మరికొంత మంది రైతులు కూరగాయల తోటలను తొలగించి, ఇతర పంటలు సాగు చేస్తారు. దాంతో కూరగాయల సాగు తగ్గి, డిమాండు మేర దిగుబడి లేక ధరలు పెరుగుతున్నాయి.

భగ్గుమంటున్న ధరలు



రోజూ వాడుకునే టమాట, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ధరలు భగ్గుమంటున్నాయి. కొత్తిమీర, పుదీన రూ.10కి చిన్న కట్ట ఇస్తున్నారు. పాలకూర, మెంతికూర, చుక్కకూర, తోటకూర రైతు బజార్‌లోనే తక్కువ కావడంతో తగ్గించి ఇస్తున్నారు. అధికారులు ధరలను తగ్గించి, సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- రాధిక, మహబూబ్‌నగర్

20 రోజులకే పెరిగాయి



20 రోజుల కిందట ఉన్న కూరగాయల ధరలు ఈరోజు లేవు. గతంలో రూ.100 తీసుకుపోతే వారానికి సరిపడ కూరగాయలు వచ్చేవి. ఈరోజు రూ.400 పెట్టినా సరిపోవటం లేదు. మా ఆయన కొచ్చే ఆదాయం ఇలాగే పెరిగితే బాగుంటుంది.

సృజన, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్‌లో ప్రార్థనలకు సిద్ధమైన వానగుట్ట ఈద్గా



మహబూబ్‌నగర్‌లో విక్రయానికి ఉంచిన పొట్టేళ్లు

నేడు బక్రీద్

- వేడుకలకు ఈద్గాలు, మసీద్‌లు ముస్తాబు
- జోరుగా పొట్టేళ్ల విక్రయాలు
- సైజును బట్టి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ధరలు
- జోగుళాంబ గద్వాలలో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 16: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ వేడుకలను ముస్లింలు సోమవారం జరుపుకోనున్నారు. అందుకోసం ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ పండుగకు దానం చేయడం అనాదిగా వస్తోంది. పొట్టేళ్లను విక్రయించారు.

ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలు, మసీదులు సిద్ధం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వానగుట్టలో ఉన్న రహెమానియా ఈద్గా వద్ద ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు హఫీజ్ ఇస్మాయిల్ ఖాద్రీ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేయనున్నారు. జడ్చర్ల ఈద్గాలో తొమ్మిది గంటలకు, దేవరకద్ర ఈద్గాలో 8:30 గంటలకు ప్రార్థనలు చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని మక్కా, మదీన, రైల్వే స్టేషన్, సిరాజుల్ ఉలుమ్ మదర్సా, షాషాబ్‌గుట్ట, సుఫిమా, రియాజుల్ జన్నా, మునీర్, అల్‌కౌసర్ మసీదులతో పాటు మండలాలు, గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేశారు.

జోగుళాంబ గద్వాలలో..


గద్వాల టౌన్: బక్రీద్ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పలువురు వ్యాపారులు దుకాణాల ముందు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేశారు. సేమ్యా తదితర సరుకులను విక్రయించారు. ఆదివారం సెలవుదినం సందర్భంగా అన్ని దుకాణాలను మూసివేస్తారు. కానీ సోమవారం బక్రీద్ నేపథ్యంలో తెరిచి ఉంచారు. ఫ్యాన్సీ దుకాణాల వద్ద మహిళల సందడి కనిపించింది. కూరగాయల మార్కెట్లో సైతం రద్దీ కనిపించింది. పట్టణ సమీపంలోని రాయచూర్ రోడ్డు గల ఈద్గా మైదానాన్ని ప్రార్థనలు సిద్ధం చేశారు. మునిసిపల్ కార్మికులు మైదానంలో చెత్తా చెదారాన్ని తొలగించారు.



గద్వాలలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న సేమ్యా

మూడు రోజులు మాంసం పంపిణీ

బక్రీద్ వేడుకల్లో ఖుర్బానికి ప్రాధాన్యం ఇస్తారు. మూడు రోజుల పాటు పొటేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. పండుగ నేపథ్యంలో పొట్టేళ్ల విక్రయాలు జోరందుకున్నాయి. శనివారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలు వెలిశాయి. పొట్టేళ్ల బరువును బట్టి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ధరలు ఉన్నాయి.



పాలమూరులో విద్యుత్ దీపాల అలంకరణలో మసీదు



గ్రామంలో పహారాలో ఉన్న పోలీసులు

కొనసాగుతున్న పోలీస్ పికెట్

- నిశ్శబ్దంగా మారిన చిన్నపొర్ల
- ప్రధాన సెంటర్లలో పహారా కాస్తున్న పోలీసులు
- అవసరం అయితే తప్ప బయటికిరాని గ్రామస్థులు

ఊట్కూరు, జూన్ 16: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం చిన్నపొర్ల సంజీవ్ హత్య నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ నాలుగు రోజులుగా కొనసాగుతోంది. ఊట్కూరు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో, మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, ఇతర భద్రత బలగాలు గ్రామంలో పహారా కాస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూస్తున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఉండటంతో ప్రజలు బయటికి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగే కిరాణం షాపులు, హోటళ్లు సాయంత్రం ఏడు గంటల వరకే బంద్ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామస్థులతో కళకళలాడే బస్టాండ్ సెంటర్ జనాలు లేక బోసిపోతోంది. గ్రామంలో దాడికి పాల్పడిన నిందితుల కుటంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి, వెళ్లిపోయారు. సంజీవ్ కుటుంబ సభ్యులు అతన్ని తలచుకుని బోరున విలపిస్తున్నారు. వారిని ఓదార్చడానికి వచ్చిన వారూ కంటతడి పెడుతున్నారు.



మూతపడిన నిందితుల ఇళ్లు



మృతి చెందిన నిమ్మల గురువమ్మ శిశువుతో చెంచు మహిళ

రక్త హీనతతో బాలింత మృతి

- పాల కోసం నెల రోజుల శిశువు రోదన

మన్ననూర్, జూన్ 16: రక్త హీనతతో బాధపడుతూ, అధిక రక్త స్రావానికి గురై ఓ చెంచు గిరిజన బాలింత మృతి చెందిన విషాదకర ఘటన నల్లమల లోతట్టు ప్రాంతంలోని ఈర్లపెంటలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక చెంచుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం ఈర్లపెంటకు చెందిన నిమ్మల గురువమ్మ(35) నెల రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు అయినప్పటి నుంచి గురువమ్మ, శిశువు రక్తహీనతతో బాధపడుతున్నారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమెకు అధికంగా రక్త స్రావం జరిగింది. ఆ సమయంలో చెంచులు తల్లీ బిడ్డలను మన్ననూరు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె పరిస్థితి చాలా విషమంగా ఉంది. చెంచుల అభ్యర్థన మేరకు ఆర్డీటీ వైద్యుడు గురువమ్మకు చికిత్స చేస్తుండగానే ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని ఆటోలో ఆదివారం వేకువజామున ఈర్లపెంటకు తీసుకెళ్లారు. నెల రోజుల చిన్నారి తల్లి పాల కోసం రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. గురువమ్మకు ఇంతకు ముందు జరిగిన రెండు కాన్పుల్లోనూ పిల్లలు రక్త హీనతతో బాధపడుతూ మృతి చెందారు. ప్రస్తుత శిశువుకు ఆరోగ్య శాఖ అధికారులు మెరుగైన వైద్యం అందించాలని చెంచులు కోరుతున్నారు.

సిగరెట్‌లో గంజాయి

- బానిసలవుతున్న టీనేజర్లు
- యువకులను ఆరా తీస్తున్న పోలీసులు

బిజినేపల్లి, జూన్ 16 : పదహారేళ్ల మైనర్ బాలురులు, నునుగు మీసాలు కూడా సరిగ్గా రాని వయస్సులో ఊరి బయట నిర్మానుష్య ప్రాంతంలో సిగరెట్లు కాల్చుతూ తమలో తామే మాట్లాడుకుంటూ మత్తుగా తూలుతున్నా వారిని అటుగా వెళ్తున్న పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకొని విచారిస్తే సిగరెటులో గంజాయి నింపి పొగ పీల్చుతున్నట్లు గుర్తించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురును శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి వస్తున్న పోలీసుల కంటపడిన వీరిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది? వారికి ఎవరు సప్లయ్ చేస్తున్నారనే విషయాలను అడిగినట్లు తెలుస్తోంది. గతంలో మండల కేంద్రంగా డగ్స్ రాకెట్‌ను పట్టుకోవడం మరువకముందే ఈమధ్య కాలంలో గంజాయికి అలవాటు పడ్డ యువకులు మత్తులో దొంగతనాలు, బాహ్యదాడులకు పాల్పడుతున్నారని, మరికొంత మంది యువకులు గంజాయి మత్తులో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మత్తుకు ఎక్కువగా పాలెం, బిజినేపల్లి, గుడ్లనర్వ, ఖానాపూర్, వట్టెం, మంగనూర్ గ్రామాలకు చెందిన యువకులు ఎక్కువగా ఆడిక్ట్ అయినట్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి సరఫరాను అరికడితే యువకులు వ్యసనానికి దూరమయ్యే అవకాశం ఉందని పలువురు అనుకుంటున్నారు. పోలీసు శాఖ అధికారులు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను పట్టుకుంటే యువత భవిష్యతును కాపాడిన వారవుతారని ప్రజలు కోరుకుంటున్నారు.

గేదెలను తరలిస్తున్న కంటైనర్ పోలీసులకు అప్పగింత

- పట్టుకున్న గో రక్షక్, హిందూ వాహిని నాయకులు

మిడ్జిల్, జూన్ 16 : మండల కేంద్రం నుంచి జడ్చర్ల వైపు ఆదివారం రాత్రి అక్రమంగా కంటైనర్‌లో తరలిస్తున్న గేదెలను గోరక్షక్, హిందూ వాహిని నాయకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రం నుంచి జడ్చర్ల వైపు కంటైనర్‌లో 24 గేదెలను హింసిస్తూ తీసుకవెళుతుండగా గమనించిన వారు వెంబడించి మున్ననూర్ టోల్‌గేట్ వద్ద అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ ఆనంద్ సిబ్బందితో కలిసి వచ్చి 24 గేదెలను నాగర్‌కర్నూల్ జిల్లా కొత్త సమీపంలో ఉన్న గోశాలకు తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో గో రక్షక్, హిందూ వాహిని నాయకులు రమేష్‌గౌడ్, పల్లె తిరుపతి, నరేష్, షైను, అరవింద్, ప్రశాంత్, బాలు, ఆనంద్, గణేష్, శేఖర్, రాము, హరిగౌడ్ ఉన్నారు.


కంటైనర్‌లో ఉన్న గేదెలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

‘నాలా’ ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

కొత్తకోట, జూన్ 16 : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామ ఫ్లై ఓవర్ వద్ద చోటుచేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదారాబాద్ గౌలిపురంలో నివాసం ఉంటున్న సురేంద్ర, మిత్రుడు సురేష్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా డోన్ మండలం, తాటిమాను కొత్తూరుకు శనివారం బైక్‌పై వెళ్తున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నాటవెల్లి ఫ్లైఓవర్ వద్ద ముందు వెళ్తున్న వాహన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు పడింది. ఈ ప్రమాదంలో సురేంద్ర (22) మృతి చెందాడు. గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు ఎసై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి దుర్మరణం



నాగయ్య (ఫైల్)

భూత్పూర్, జూన్ 16 : రోడ్డు ప్రమాదంలో గృహనిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన చట్కురి నాగన్న(50) వృత్తి రీత్యా గృహ నిర్మాణ కార్మికుడు. శనివారం రాత్రి 10:30గంటల సమయంలో తన మోటారు సైకిల్‌పై తాటికొండ గ్రామం నుంచి భూత్పూర్‌కు వస్తున్నాడు. ఈ తరుణంలో మండలంలోని పోతులమడుగు శివారులో నాగన్న ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే రోడ్డుపై దుర్మరణం చెందాడు. తల, మొండెంపై వాహనాలు వెళ్లడం మృతదేహం పూర్తిగా ఛిద్రమై మాంసం ముద్దలా మారిపోయింది. చట్కురి నాగన్న ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ పూర్తిగా రెండు ముక్కలై ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుని భార్య చట్కురి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మల్లేష్ (ఫైల్)

మిడ్జిల్, జూన్ 16 : మండలంలోని రాణిపేట గ్రామానికి చెందిన మల్లేష్ (32) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం మాధారం గ్రామానికి చెందిన మల్లేష్ పదేళ్ల క్రితం రాణిపేట గ్రామానికి చెందిన మమతతో కులాంతర వివాహం చేసుకున్నట్లు తెలిపారు. మల్లేష్ మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ పంప్‌లో పనిచేసేవాడని తెలిపారు. రోజులాగే శనివారం రాత్రి ఇంటికి వచ్చిన అతను ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని వేలాడుతుండగా గమనించిన భార్య చుట్టు పక్కల వారిని పిలిపించి చూసే సరికి అప్పటికే మల్లేష్ మృతి చెందినట్లు తెలిపారు. రాణిపేట గ్రామానికి చేరుకున్న మృతుడి బంధువులు మల్లేష్‌ను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. మల్లేష్ మృతిపై అతని మామ రవి అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మృతి చెందిన మల్లేష్‌కు ఒక కుమారుడు, కూతురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

పలువురి పరామర్శ

మల్లేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ తిరుపతమ్మరవీందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు లాలుతో పాటు పలువురు నాయకులు పోస్టుమార్టం వద్ద మృతుడి బంధువులను పరామర్శించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు పోలీసులను కోరినట్లు తెలిపారు.

మామ చేతిలో అల్లుడి దారుణ హత్య

- కూతురిని వేధిస్తుండడంతో సహనం కోల్పోయి దారుణం
- నిద్రిస్తున్న సమయంలో తలపై రాళ్లతో దాడి





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, మృతుడు దేవేందర్(ఫైల్)

ఉండవల్లి, జూన్ 16 : పెళ్లయిన ఏడాది నుంచి కూతురిని వేధిస్తుండటంతో సహనం కోల్పోయిన మామ అల్లుడిని చంపేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు, అలంపూర్ సీఐ రవిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటి ఆరు సంవత్సరాల క్రితం తన కుమార్తె మహేశ్వరికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులోని కొండారెడ్డినగర్ కాలనీకి చెందిన దేవేందర్ (36)తో వివాహం చేశారు. వారికి శ్యాంసుందర్, శ్రీకృష్ణ ఇద్దరు కుమారులున్నారు. అయితే మద్యానికి బానిసైన దేవేందర్ పెళ్లయిన రెండు నెలల నుంచే మహేశ్వరిని నిత్యం వేధిస్తున్నాడు. ఈ విషయంపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. అయినా అతడిలో మార్పు రాలేదు. దీంతో కొన్ని నెలల క్రితం మహేశ్వరి ఉండవల్లిలోని తన పుట్టినింటికి వచ్చేసింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు దేవేందర్ అత్తగారింటికి వచ్చి గొడవపడ్డాడు. అదే రోజు రాత్రి మద్యం తాగి వచ్చి అర్ధరాత్రి వరకు మామ, భార్యతో మళ్లీ గొడవ పడి ఇంట్లోనే పడుకున్నాడు. మహేశ్వరి పిల్లలతో కలసి నాయనమ్మ పద్మమ్మతో పాటు ఇంటి ముందున్న గుడిసెలో పడుకోగా, మద్దిలేటి బయట పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత మద్దిలేటి లేచి, ఆవరణలో ఉన్న నాపరాయి, పొయ్యి రాళ్లతో ఇంట్లోకి వెళ్లి అల్లుడు దేవేందర్ ముఖంపై బలంగా బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలులో పలు హోటళ్లలో వంట మాస్టర్‌గా పని చేసేవాడని తెలిసింది. మృతుని తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిబాబు వెల్లడించాడు. నిందితుడు మద్దిలేటి పరారీలో ఉన్నట్లు తెలిపారు. డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన పరిణామాలు, ఇంట్లో జరిగిన ఘర్షణ తదితర అంశాలను ఎస్‌ఐ శ్రీనివాసులు నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

- వైభవంగా ధ్వజారోహణం
- గరుడముద్ద కోసం పోటెత్తిన భక్తులు



గరుత్మంతునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

కందనూలు, జూన్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శ్రీరంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సంకేతంగా ధ్వజారోహణం, సకల దేవతలను ఆహ్వానించే దేవతాహ్వానం, బేరీపూజ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గరుత్మంతునికి నైవేద్యంగా పెట్టిన అనంతరం గరుడముద్ద అనే ప్రసాదాన్ని సంతానం కోరుకునే దంపతులకు అందజేశారు. గరుడ ముద్ద ప్రసాదం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. సాయంత్రం స్వామి వారి పల్లకిసేవ, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు స్వామి వారి కల్యాణం

శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి తిరుకల్యాణం సోమవారం ఉదయం 11గంటల నుంచి నిర్వహించనున్నారు. కల్యాణోత్సవం కోసం పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరు కానుండడంతో విశేష ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారని వారు తెలిపారు. సోమవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 25అడుగుల ఎత్తైన భారీ రథంపై స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించనున్నారు.

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, జూన్ 16 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఈ ఆదివారం దాదాపు 30వేలకు పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మృగశిర కార్తె కావడంతో భక్తులు మైసమ్మ దేవత దర్శనం కోసం తరలిరావడంతో మైసమ్మ దేవాలయం నుంచి దాదాపు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడంతో భక్తులకు ఊరట కలిగింది.

స్టేట్ హోంకు బాలిక తరలింపు

నవాబ్‌పేట, జూన్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి శనివారం అర్ధరాత్రి వేళ నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలికను ఓ వ్యక్తి వెంబడిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి, ఆ బాలికలను అదుపులోకి తీసుకుని స్టేట్ హోంకు తరలించారు. నారాయణపేట జిల్లాలోని ఓ మండలానికి చెందిన బాలిక అర్ధరాత్రి నవాబ్‌పేట నుంచి జిల్లా కేంద్రానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఆ బాలిక వెంట మరో వ్యక్తి వెంట వెళ్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ అభిషేక్ రెడ్డి తన బృందంతో కలిసి వెళ్లి సదరు బాలికలను అదుపులోకి తీసుకుని విచారించారు. అక్కడి నుంచి నేరుగా జిల్లా కేంద్రంలోని స్టేట్ హోంకు తరలించారు. తల్లిదండ్రులు వస్తే బాలికను అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు. మండల కేంద్రంలో సదరు బాలిక అక్కాబావ ఉండగా, వారి వద్దకు వచ్చిందని, అక్కడ ఏమి జరిగిందో కానీ, బాలిక జిల్లా కేంద్రానికి నడుచుకుంటూ వెళ్తుండగా సమాచారం అందడంతో కాపాడినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాపూర్, జూన్ 16 : మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులోని దుందుభీ వాగులో నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. మండలంలోని మల్లేపల్లి శివారులోని దుందుభీ వాగులో శనివారం రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలించడానికి ప్రయత్నిస్తుండగా గస్తీలో ఉన్న కానిస్టేబుళ్లు సుదర్శన్, రామకృష్ణారెడ్డి పట్టుకున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు అడగగా, లేవని చెప్పడంతో వాహనాలను, డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ప్రహరీ కూల్చారని ఫిర్యాదు

జడ్చర్ల, జూన్ 16 : జడ్చర్ల పట్టణంలోని సర్వే నెంబరు 147/బిలో నెంబరు 4/బి గల 320 చదరపు గజాల ప్లాటుకు నిర్మించిన ప్రహరీని నందకిశోర్, సతీష్‌రెడ్డి అనే వ్యక్తులు కూల్చివేసారంటూ బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ప్రహరీని కూల్చి, ప్లాటును ఆక్రమించేందుకు కంకర, మట్టిని పోసారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జడ్చర్ల, జూన్ 16 : జడ్చర్ల మండలం కొండేడు గ్రామానికి చెందిన నరేందర్ అనే వ్యక్తి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని జడ్చర్ల ఎస్‌ఐ శివానందం తెలిపారు. గ్రామంలో ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసిన ప్లాటు విషయంలో గ్రామంలోని ఓ వర్గానికి చెందిన కొందరు తమపై అకారణంగా దూషించడం, దౌర్జన్యంగా బెదిరిస్తుండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. నరేందర్ సోదరుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఖిల్లాఘణపురం, జూన్ 16: కోడి పందేలా స్థావరంపై దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మానాజీపేట గ్రామ శివారు వ్యవసాయ పొలంలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తుననట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో కోడి పందెం ఆడుతుండగా 15 బైకులు, 11 కోళ్లు, 7 సెల్‌ఫోన్లు రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తులు కోడి పందేలలో పాల్గొన్నట్లు తెలిపారు. పందెం రాయుళ్ల బైకులను, పందెం కోళ్లను ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోడి పందాలు, పేకాట రాయుళ్లపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



కెతావత్ జెమ్రీ

జడ్చర్ల, జూన్ 16 : జడ్చర్ల నుంచి గంగాపురానికి వెళ్లే దారిలోని స్నేహ కంపెనీ సమీపంలో రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు... మిడ్జిల్ మండలం లింబ్యాతండాకు చెందిన కెతావత్ జెమ్రీ(36) తన బంధువైన కెతావత్ సోనాలిని స్నేహ పరిశ్రమ సమీపంలో కలిసింది. ఇద్దరు రోడ్డు దాటుతుండగా కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తలకు, చెంపలకు, చేతులకు తీవ్రగాయాలైన జెమ్రీ అక్కడికక్కడే మృతిచెందింది. కెతావత్ సోనాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ వివరించారు.

బక్రీద్ నమాజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- నేడు ఈద్-ఉల్-అజహా



నాగర్‌కర్నూల్‌లోని ఈద్గా వద్ద ఏర్పాట్లు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

కందనూలు, జూన్ 16 : బక్రీద్ ప్రత్యేక నమాజ్ ఈద్-ఉల్-అజహా కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ఈద్గా వద్ద మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఈద్గాకు కలర్స్‌తో పాటు పెండాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా వర్షం వస్తే ఇబ్బందులు కలుగకుండా చిప్స్‌తో కూడిన దస్తును నేలపై పరుస్తున్నారు. ఉదయం 9గంటలకు నాగర్‌కర్నూల్ ఈద్గాలో ఈద్-ఉల్-అజహా ప్రత్యేక నమాజ్ ఉంటుంది. అదేవిధంగా ఒకవేళ వర్షం వచ్చి నమాజ్‌కు ఈద్గాలు అనువుగా లేకపోతే ఆయా గ్రామాలు, పట్టణాల్లోని మసీద్‌లలో నమాజ్ చదవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి ఈద్గా వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

● కల్వకుర్తి: బలిదానానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ పర్వదినం కోసం ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. బక్రీద్‌ను జరుపుకోవడానికి ముస్లింలు సమాయత్తమవుతున్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లను మునిసిపల్ అధికారులు పూర్తి చేశారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సోమవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలపడానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఈద్గాల వద్దకు హాజరవుతున్నట్లు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ జి.మాధవరెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు.

ప్రకృతిని పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం



చెట్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 16 : దేవతామూర్తులు కొలువై సజీవంగా వెలసిన వృక్షాలను పూజిస్తే విశేషమైన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆలయ అర్చకుడు వెల్దండ సురేష్ అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం ముందు వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలోని దేవతా వృక్షాలకు ఆదివారం అభిషేకం, సుగంధ ద్రవ్య ఫల రస, విభూతి అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతిలో మానవుడికి మేలు చేసే వృక్ష జాతులను నిత్యం పూజించడం ద్వారా వాటి ద్వారా ఆక్సిజన్, ఇతర వాటి గుణాల ద్వారా ఎలాంటి రోగాలు దరి చేరకుండా సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవనం సాగించవచ్చని అర్చకులు వివరించారు. ప్రత్యేక పూజల్లో లక్ష్మణ్, విఠల్, వినయ్, మహిళ భక్తులు ఉన్నారు.

నీట్ ఎగ్జామ్స్ అవకతవకలకు నిరసనగా మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

అచ్చంపేటటౌన్, జూన్ 16 : నీట్ ఎగ్జామ్స్ అవకతవకలకు నిరసనగా ఆదివారం అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ నీట్ ఎగ్జామ్స్‌లో నష్టపోయిన విద్యార్థులకు మళ్లీ ఎగ్జామ్స్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా ఎన్‌టీఏ సంస్థను బ్యాన్ చేయాలన్నారు. నీట్ ఎగ్జామ్స్‌లో జరిగిన తప్పుల వల్ల ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ అవకతవలకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని మానుకోవాలన్నారు. నాయకుడు చత్రునాయక్, మాజీ ఎంపీపీ రామనాదం, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు షైబెల్లి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ లక్ష్మణ్, తిరుపతయ్య, సోమ్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, నాయకులు లడ్డుయాదవ్, సోహెల్, బాల్‌నారి, ఈశ్వర్, గణేష్, హరిశ్చంద్ర, ఆంజనేయులు, నాగరాజు ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

కందనూలు, జూన్ 16 : ఉపాధ్యాయుల అన్ని క్యాడర్ల బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో గోవిందరాజులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకగా చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలని, అదేవిధంగా లాంగ్వేజ్ పండిట్స్ స్కూల్ అసిస్టెంట్ తదితర పోస్టుల్లో సీనియారిటీ లిస్టుల్లో తప్పులను సవరించి మెరిట్‌కం రోస్టర్ విధానాన్ని అమలుపరుస్తూ తేదీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు.

అంతేకాకుండా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రమోష న్ ద్వారా ఖాళీ అయిన అన్ని సబ్జెక్టుల ఖాళీలను ట్రాన్స్ఫర్‌లో చూపించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. గతంలో ఎల్ఎఫ్ఎల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కు హాజరు కాని తిరస్కరించిన అభ్యర్థుల స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పిం చాలని కోరారు. అన్ని క్యాడర్ల సీనియారిటీ లిస్టులను డీఈవో నాగర్‌కర్నూల్ వెబ్ సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాల న్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వర్, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్షుడు ఎస్.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం 28న జిల్లా స్థాయి ఎంపికలు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 16: తెలంగాణ రాష్ట్రంలో వివిధ క్రీడా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థుల వయస్సు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి 8 నుంచి 9 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు.

ఆసక్తి కలిగిన విద్యార్థులు వారి ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్‌కార్డు, కమ్యునిటీ సర్టిఫికెట్‌తో పాటు పది పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఎంపికలు హాజరు కావాలని ఆయన సూచించారు.

'డబుల్' ఇల్లు దక్కేనా?

- ఏళ్లుగా కొనసాగుతున్న పనులు
- సొంతింటి కోసం పేదల ఎదురుచూపులు



జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 16: సొంతింటి కలను నిజం చేసేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. ఇళ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేసుకున్నా అర్హులైన వారికి అందించడంలో జాప్యం జరుగుతోంది. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల సామాన్యులు గూడు లేక అవస్థలు పడుతున్నామంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన కొసాగుతున్నాయి. దాదాపుగా ఐదేళ్ల క్రితం ఒక్కో బ్లాకులో 32 ఇళ్ల చొప్పున ఆరు బ్లాకుల్లో మొత్తం 192 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. గదుల నిర్మాణం పూర్తయినా ఫ్లోరింగ్, డోర్లు, కిటికీలకు గ్లాస్ ఫిటింగ్, విద్యుత్ వైరింగ్, పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మాణ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందకపోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డంగా మారాయి. గత పాలకుల అలసత్వం కారణంగా పెండింగ్ పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు పంపిణీకి నోచుకోలేదు. ఇదిగో, అదిగో అంటూ ఊదరగొట్టి చివరకు తమకు ఇల్లు లేకుండా చేశారని వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన తమ సొంటింటి కల నెరవేర్చాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేసి పంపిణీ చేయాలి



నిరుపేదలకు ఇల్లు కట్టించి ఆదుకుంటామని పాలకులు గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో పెట్టడం లేదు. జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ పనులు వేగవంతం చేసి పేదలకు పంపిణీ చేయాలి.

- శివశంకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

- ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం హరికథ
- నేడు భక్త లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

కందనూలు, జూన్ 16 : జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద గల శ్రీభక్త లక్ష్మీనరసింహస్వామి వారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, లక్ష్మీనరసింహస్వామి ఆహ్వానం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో రెండవ రోజు కార్యక్ర మాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వ్యవస్థాపక ధర్మకర్త కాశింశెట్టి విజయ లక్ష్మీ స్వామి వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం పద్మాలయ ఆచార్య ఆధ్వర్యంలో పార్వతీ కల్యాణంపై హరికథ కార్యక్రమం కళ్లకు కట్టినట్లు నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన భక్త లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

ప్రహరీ నిర్మాణం జరిగేనా?

- భయాందోళనలో కస్తూర్బా గురుకులం విద్యార్థినులు



కల్వకుర్తిలో కాంపౌండ్ వాల్ లేని కస్తూర్బాగాంధీ విద్యాలయం

కల్వకుర్తి, జూన్ 16 : కల్వకుర్తి పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి కాంపౌండ్ వాల్ లేక విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఏళ్ల కాలంగా ప్రహరీ నిర్మాణం కోసం విద్యార్థినులకు ఎదురు చూపులు తప్పడం లేదు. కల్వకుర్తి పట్టణంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 360మంది విద్యార్థినులు విద్యాభ్యాసం గావిస్తున్నారు. కల్వకుర్తి పట్టణ చివర్లో విద్యాలయం ఉండడం కాంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. విశాలమైన స్థలం ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పొలాల వద్దకు వెళ్లే వారు ఇతరులు సైతం ఆవరణ సమీపం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వకుర్తి పట్టణంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ప్రహరీ ఏర్పాటు చేయాలి



కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతున్నది. విద్యాలయానికి కాంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థినులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాత్రి వేళల్లో భయాందోళనకు గురి కావాల్సిన పరిస్థితి. కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలి.

- రమాదేవి, ఎస్‌వో

గురుకులాల్లో వసతులతో కూడిన మెరుగైన విద్య

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మన్ననూరు సాంఘిక సంక్షేమ గురుకులం పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, జూన్ 16: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో మెరుగైన వసతులతో కూడిన మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో పీఎంశ్రీ పథకం కింద రూ. 13.50లక్షల నిధులతో నిర్మించనున్న సైన్స్ ప్రయోగశాల భవన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం గురుకులం తరగతి గదులను పరిశీలించారు. గురుకులంలో కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన చేసే విషయమై గురుకులం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులంలో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. విద్యార్థినులకు కోతుల నుంచి రక్షణ కల్పించేందుకు కాంపౌండ్ చుట్టూ సోలార్ ఫినిషింగ్‌తో కూడిన కంచెను ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. విద్యార్థులు ఏ-1 గ్రేడ్‌లలో ఉత్తీర్ణులైతే సరిపోదని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు డాక్టర్ లేదా ఇంజనీయర్ లాంటి ఉన్నత స్థానాల్లో ఎదిగేలా బోధకులు చొరవ తీసుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి మన్ననూరు గురుకుల కళాశాలను సీవోఈ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో మె రుగైన విద్య, వైద్యం అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. గురుకులాల ప్రాంతీయ స మన్వయకర్త వనజ, శ్రీనివాసులు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అధికారి కోటేశ్వరరావు, అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసు లు, ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, గురుకులం ప్రిన్సిపాల్ రూపాదేవి, కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, జూలూరి సత్యనారాయణ, బాలస్వామి, మల్లికార్జున్, లోకనాథం, మేరాజ్, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, శివాజి, తుల్స్యా నాయక్ , మధు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జూన్ 16 : ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొట్ర గ్రామంలో కరాటే మాస్టర్ నీరటి కుమార్ పర్యవేక్షణలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టుల ప్రధాన కార్యక్రమానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో కొట్ర గ్రామసేవాసమితి అధ్యక్షుడు రవీందర్‌రావు, నాగరాజుగౌడ్, శివరాణి, ఆంజనేయులు, వెంకటయ్య, సహదేవ్, సతీష్ తదితరులు ఉన్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- బోర్డు రాడ్లు నాటి రూ. 2లక్షల 85 వేలు కాజేశారు..!



ఉప్పునుంతలలో క్రీడా ప్రాంగణం

ఉప్పునుంతల, జూన్ 16: విద్య, ఉద్యోగ రంగాలతో పాటు క్రీడా రంగాలలో యువత రాణించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మహ్మాతాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ గ్రామంలో ఆహ్లాదకరమైక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. కానీ అందుకు విరుద్ధంగా మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా 22 గ్రామాల్లో నామమాత్రంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఎక్కడా కూడా గ్రామాల్లో నిబంధనల ప్రకారం స్థలం లభించకపోవడంతో ప్రభుత్వం పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డులు నాటి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లోనే క్రీడా ప్రాగంణాలు ఏర్పాటు చేస్తే పాఠశాల సమయంలో గ్రామీణ యువత ఆటలు ఆడేందుకు వస్తే విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. అయినా కొన్ని పాఠశాలల్లో బోర్డులను ఏర్పాటు చేసి నిధులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి.



తిప్పాపూర్‌లో పశువుల పాకలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

● క్రీడా ప్రాంగణం నిబంధనలు ఇవి..

గ్రామాల్లో ప్రభుత్వ భూమి కానీ ప్రైవేట్ భూమి అయినా ఎకరం కొనుగోలు చేయాలి. ఆ భూమిని చదును చేసి, అందులో 50 మీటర్ల వెడల్పు 80 మీటర్ల పొడవు బౌండ్రీగా చుట్టూ మొక్కలు నాటాలి. అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, సింగిల్ బార్ ఎక్సర్ సైజ్ ఏర్పాటుతో క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలి.

● నిబంధనలకు తూట్లు

మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ సమీపంలో బోర్డుతో పాటు సింగిల్, డబుల్‌బార్‌కే పరిమితమైంది. వీటి ఏర్పాటుకే దాదాపు 2 లక్షల 85 వేలు నిధులు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే విధంగా తిప్పాపూర్‌లో గ్రామానికి కిలోమీటర్ దూరంలో వ్యవసాయ పొలాల మధ్య ఏర్పాటు చేయడం వల్ల క్రీడా ప్రాంగణానికి క్రీడాకారులు వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో కొందరు పశువులను కటేస్తున్నారు. ఇక్కడ కూడా దాదాపు రూ.లక్షా 60 వేలు డ్రా అయినట్లు తెలుస్తుంది. ఎక్కడా కూడా క్రీడా ప్రాంగణాలు పూర్తి కాకపోవడం కొన్ని చోట్ల అయినా బోర్డులకే పరిమితమయ్యాయి. దీంతో లక్ష్యం నీరుగారుతున్నది.

● ప్రభుత్వ నిబంధనల మేరకే

ప్రభుత్వ నిబంధనల మేరకే మండలంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు ఏర్పాటు చేపట్టాం. చేసిన పనుల మేరకే డబ్బులు ఇవ్వడం, కొన్ని గ్రామాల్లో భూములు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశాం.

- సుదర్శన్‌గౌడ్, ఏపీవో

మల్లురవిని సన్మానించిన నాయకులు



ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోడేరు, జూన్ 16 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ మెంబరు మల్లురవిని సన్మానిం చిన కోడేరు మండల నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని మల్లురవి స్వగృ హంలో కోడేరు మండల నాయకులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎత్తం గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య మాట్లాడారు. నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మల్లెపల్లి జగనమోహన్‌రెడ్డి, నాగులపల్లి మిద్దెల కృష్ణయ్య, జనుంపల్లి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు తొందరపడి నారు పోసుకోవద్దు

బిజినేపల్లి, జూన్ 16 : రైతులు తెలంగాణ సోనా వరి (ఆర్ఎన్ఆర్-15048) రకాన్ని వానాకాలంలో సాగు చేసేటప్పుడు జూన్‌లో నారు పోసుకోకూడదని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. జూన్‌లో నారు పోసుకుంటే పంట కాలం పెరగడంతో పాటు పైరు ఏపుగా పెరిగి పడిపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. రైతులు జూలై మొదటి వారంలో నారు పోసుకోవడంతో పాటు నత్రజని ఎరువులను కూడా సిఫారసు చేసిన మేరకు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. తెలంగాణ సోనా రకం ఎక్కువ మంది రైతులు సాగు చేస్తుండడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో గతేడాది 8 వందల క్వింటాలు, ఈ ఏడాది వెయ్యి క్వింటాళ్లు ఆర్ఎన్ఆర్-15048 రకం విత్తనాన్ని అందించినట్లు తెలిపారు.

వచ్చే ఎడాది ఎక్కువ మొత్తం విత్తనోత్పత్తి చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఎఆర్ఎస్‌లో ఆరుతడి పంటలైన కంది, జొన్న, ఆముదం, చిరుధాన్యాలు, వేరుశగన విత్తనోత్పత్తి చేపట్టి ఉమ్మడి జిల్లా రైతుల విత్తన అవసరాలను తీర్చుతున్నట్లు తెలిపారు.

ఉమెన్ నైట్ వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

ఉప్పునుంతల, జూన్ 16 : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉమెన్ నైట్ వాచ్‌మన్ పోస్టు ఖాళీగా ఉందని పాఠశాల ప్రత్యేకాధికారి సైదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు అర్హతలు 10వ తరగతి పాసై ఉప్పునుంతల మండలానికి చెందిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16 నుంచి 18 వరకు అభ్యర్థులు తమ ధ్రువపత్రాలు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అందచేయాలని కోరారు.


బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

వెల్దండ, జూన్ 16 : అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దాపూర్ గ్రామపంచాయతీలోని తుంకిబండతండాకు చెందిన గోపాల్‌కు చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా 2 లక్షల రూపాయల ఎల్‌వోసీ మంజూరయ్యింది. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బాధితునికి మంజూరైన చెక్కును అందజేశారు. నాయకులు కేశమళ్ల కృష్ణ, ప్రవీణ్‌నాయక్, అనిల్‌కుమార్, రాజునాయక్, రాజేష్‌నాయక్, పంతునాయక్ తదితరులు ఉన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం'

చారకొండ, జూన్ 16: గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గైరాన్‌తండాలోని వంకరాయితండాలో ఎస్ఐ రాజశేఖర్, నాయకులతో కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ తాగునీటి బోరు మోటారును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో తాగునీటి సమస్య ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దృష్టికి తండావాసులు తీసుకెళ్లారని అన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో బోరు వేసి మోటారు బిగించి తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, సందీప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రూప్‌సింగ్, హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి



పెంట్లవెల్లి గ్రంథాలయం దగ్గర నిరసన తెలుపుతున్న మహిళలు

పెంట్లవెల్లి, జూన్ 16 : ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రంథాలయ దగ్గర స్థానిక మహిళలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఆరు సంవత్సరాల చిన్నారిని అత్యాచారం చేసి చంపిన దుండగున్ని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో కఠినమైన చట్టాలున్నా కూడా ఇలాంటి సంఘటనలు జరగడం దారుణ మని వారు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 20లక్షల ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరారు.

మహిళా సంఘం మండల అధ్యక్షురాలు గుండమ్మ, సాలమ్మ, సరోజా, చిట్టెమ్మ, సీఐటీయూ నాయకులు తిమ్మస్వామి, అమ్ములమ్మ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పునుంతల, జూన్ 16 : మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామం నుంచి ఆదివారం బొలెరో వాహనంలో ఆవు, దూడ, ఎద్దును నూర్‌పాషా వెల్దండకు తరలిస్తున్నాడు. లత్తీపూర్ చెక్‌పోస్టు పోలీసులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అచ్చంపేట సీఐ రవీందర్ విచారణ చేసి గోవులను వట్టెం గోశాలకు తరలించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుజ్ఞానం తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మన్ననూర్, జూన్ 16: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో శనివారం ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన పిట్టల పర్వతాలు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం పరామర్శించారు. అంత్యక్రియలు జరుగుతున్న క్రమంలో అక్కడికి చేరుకున్న ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదం జరుగడం దురదృష్టకరమని, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, తుల్స్యా, సురేష్, రమణ గౌడ్, పాల్గొన్నారు.